నూరేళ్ళ తెలుగు కథకు
**నవ్య నీరాజనం-90**
నూరేళ్ళ తెలుగు కథకు



**సామ్రాజ్యవాద స్వేచ్ఛా మార్కెట్ సంస్కృతి, ప్రజాస్వామ్య విలువల్ని కాలరాసే అమానవీయ విష సంస్కృతిని ఎండగట్టే రచనా పోరాట స్ఫూర్తితోనే కథకు సార్థకత ఉంటుందని విశ్వసించి దేశభక్తి, జాతీయ భావం అంతస్సూత్రంగా విప్లవ రచనా మార్గంలో సాహిత్య యాత్ర చేస్తోన్న దిగంబర కవిత్వోద్యమ సారథి -కథకుడు నిఖిలేశ్వర్‌తో ఈ వారం ఇంటర్వ్యూ**

# జీవితం - ఉద్యమాలే నా కథలు

**- నిఖిలేశ్వర్**


ఐదు దశాబ్దాల నా సాహిత్య యాత్రలో నేను రాసిన కథలు దాదాపు నలభైదాకా వుంటాయి. ఆలస్యంగానైనా 2002లో కథల సంపుటి 22 కథలతో వెలువడి నూరేళ్ల తెలుగు కథానిక ప్రపంచంలో నా స్థానాన్ని సుస్థిరం చేసింది. ప్రతి కథానిక నేపథ్యంలో నా జీవితంలోని ఏదో ఒక సంఘటన, ఉద్యమపరంగా నేను పొందిన అనుభవాలు వున్నాయి.

## బాల్యం-చదువు

నల్లగొండ జిల్లా వీరవల్లి గ్రామంలో జన్మించాను. వీరవల్లి (భోనగిరి దగ్గర)లోని మా రైతు కుటుంబంలో ఎవ్వరూ అక్షరాస్యులు కూడా కాదు. నేను పుట్టిన ఆరు నెలలకే మా నాన్న చనిపోయాడు. సర్వస్వం అమ్మనే! హైదరాబాద్ నగరంలో అస్తిత్వం కోసం అమ్మ తన కార్మిక జీవితాన్ని వజీర్ సుల్తాన్ కుటుంబ కంపెనీ (వి.ఎస్.టి) లో ప్రారంభించి, నా కోసం ముప్పది సంవత్సరాలు శ్రమించింది. జమిస్తాన్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎస్.సి దాకా ముస్లిం-క్రైస్తవ సోదరుల మధ్య చదువు, ఆట పాటలు స్వేచ్ఛగా కొనసాగించాను. 1964-66 మధ్య ఉస్మానియా యూనివర్శిటీలో ఎం.ఎ. (సైకాలజీ) చదివాను.

ముషీరాబాద్-బాకారం పరిసరాల్లో నడచిన నా బాల్యంలో ఆ జైలు గోడలను చూస్తూ భయపడేవాణ్ణి. ఈ వర్గ వ్యవస్థలో మనుషులు ఎందుకు నేరస్థులుగా మారిపోతారో క్రమంగా అర్థం చేసుకున్నాను. ఆశ్చర్యంగా ఇదే ముషీరాబాద్ (సికింద్రాబాద్) జైలులో 1971లో నేను, జ్వాలాముఖి, చెరబండరాజు డిటెన్యూలుగా వున్నాము. పౌర హక్కుల ఉద్యమ కారులుగా, విరసం కవులుగా 56 రోజుల పాటు కారాగార శిక్ష అనుభవించిన తర్వాత నేను ''గోడల వెనక'' అనే శీర్షికన మా జైలు అనుభవాలను కథాత్మక శైలిలో రచించాను.

1948లో హైదరాబాద్ సంస్థానం(అప్పటి తెలంగాణా) నిజాం కబంద హస్తాల నుంచి విడిపోయింది. యూనియన్ సైన్యాలు ట్యాంకులపై (ఆరోజుల్లో మేం వాటిని ''చెయిన్ మోటార్లు''అనిపిలిచేవాళ్లం!) నగర ప్రవేశం చేసి సుల్తాన్ బజార్ చౌరస్తా నుండి వెడుతుంటే నేను మిగతా పిల్లలతో చేతులు ఊపుతూ,సైనికు



భార్య యామినితో...

లతో కరచాలనం చేసిన అనుభూతి ఇప్పటికీ జ్ఞాపకం.

మా మేనమామ ఊరు ముత్తిరెడ్డి గూడెం (చాడ) లో రజాకార్ల భయానికి మేమంతా గడ్డి వాముల పక్క తలదాచుకోవడం, కాటేపల్లిలో రజాకార్లు గొర్రెల కాపర్లను బాహాటంగా కాల్చివేస్తే, వారికి స్మారకాలు నిర్మించి ప్రజలు ఉత్సవాలు జరపడం.... కమ్యూనిస్టు గెరిల్లా పోరాటం....ఇవన్నీ బాల్యంలో చూసినవే!

జాతీయ భావం-దేశభక్తి అంతస్సూత్రంగా ప్రేర ణగా నిలిచేవి. అప్పుడే ఆర్యసమాజ్ ప్రభావం మొద లైంది. సాహిత్య ప్రభావానికి ముందే దైవభక్తి ఆకట్టు కుంది. భగవద్గీత పఠనం అధ్యయన ఆశయంగా మారిపోయింది.

చదువుకునే రోజుల్లోనే పార్ట్ టైం జాబ్‌గా జర్నలి జంలో శిక్షణ పొందాను. సివిలియన్ స్కూలు మాస్టా రుగా ఎ.ఓ.సిలో సైనికులకు చదువు చెప్పాను. జ్వాలాముఖి అక్కడ సహ ఉద్యోగి! కొంతకాలం మద్రాస్ తాంబరం ఎయిర్‌ఫోర్స్‌లో క్లర్కుగా పనిచే శాను. చివరగా 1966 నుంచి కేశవ స్మారక విద్యాల యంలో 30 సంవత్సరాలపాటు ఇంగ్లీషు-సోషల్ బోధించే ఉపాధ్యాయునిగా పని చేశాను.

## కథా రచన ఒక సవాలు

కవిత్వమే ప్రధానభాగమైనా, కథా రచన నాకు ఒక సవాలుగా నిలిచేది. 1960-61 మధ్య నేను రాసిన కథ 'నిరాశ్రయులు'' ఆనాటి సికింద్రాబాద్ (ముషీరాబాద్) జైలు లోంచి పారిపోయిన ఖైదీల సంఘటన ఆధారం. ఆ కథలో చివరన ఫకీరు పారి పోయిన ఖైదుతో అన్న మాటలు-''అవును సత్యం! జీవితం నిర్థకం ఇక్కడ. ఏ అభివృద్ధి పథకాలైనా బ్రత కనేర్చినవాడికొరకే ఉపయోగపడతాయి. కాని నాకు-నీకు కాదు. బ్రతుకు చేతుల్లో వోడిపోయాము-అం దుకే ఈ సంఘం మనకు ఆశ్రయం ఇవ్వదు.....'' ఈ నైరాశ్యంతో ఆఖరున ఆత్మహత్యకు పూనుకున్న సన్ని వేశంతో ముగిసింది ఆ కథానిక-యిది కె.యాదవ రెడ్డి పేరుతో 23-8-1961 ఆంధ్ర సచిత్ర వార పత్రి కలో వచ్చింది. వెలుగు-నీడల దృశ్యంగా బాపు వేసిన బొమ్మ నిండుదనాన్ని సమకూర్చింది. అయితే ''నిరాశ్రయులు'' కథలోని నైరాశ్యం వోటమి తత్వం కాలక్రమంలో కరిగిపోయి, దిగంబర కవుల ఉద్య మంతో, విప్లవ రచనామార్గం ఒక సార్థక పరిణామం.' నా రచనా యాత్రలో అదో కీలకమైన మలుపు!

## ప్రోత్సాహం

1961-64 మధ్య నిజాం కాలేజీ సాయం కళా శాలలో చదువుకునే రోజుల్లో బ్రిటన్‌లో వచ్చిన యాంగ్రీ యంగ్‌మెన్'' సాహిత్య ధోరణి నన్ను ఆక ర్షించింది. అప్పటికే ''నెహ్రూ సోషలిజం'' అంటే నమ్మకం ఏర్పడినా సామాజిక-విద్యాపరమైన రాజ కీయ అవలక్షణాలను చూసి విపరీతమైన కోపం వచ్చేది. ఫలితంగా తెలుగులో మొదటిసారిగా ''కోపోద్రిక్త యువతరం'' అనే శీర్షికన రచనలు ప్రారంభించాను. ఆ ఉద్యమం గురించి ''కృష్ణా పత్రి క''లో వివరంగా ఒక వ్యాసం రాసాను. వ్యాసాలు-కవితలు ప్రచురించాను. వీటిని ప్రచురించి నన్ను ప్రోత్సహించింది ''గోలకొండ పత్రిక''!

## సాహిత్య ప్రభావం

హిందీతోపాటు కాలేజీ రోజుల్లో ఇంగ్లీషు అనువా దాల్లో కొన్ని ఫ్రెంచ్ రచనలు చదివాను. బి.ఎ. లో వుండగా నేను రాసిన '' ALONE''అనే ఇంగ్లీషు కవి తకు ప్రథమ బహుమతిగా జాన్ కీట్స్ కవితా సంపుటి బహుకరించారు. నన్ను బాగా ఆకర్షించిన ఇంగ్లీషు నవలా రచయిత సోమర్‌సెట్ మామ్! ఆయన నవలలు-కథలు-వ్యాసాలు చదివి కాలేజీ మ్యాగజైన్‌లో ఒక పెద్ద వ్యాసమే రాసాను-The universal projections అనే శీర్షికన! టాల్‌స్టాయ్, దోస్తవస్కీ, గోర్కీ లాంటి రష్యన్ నవలలు చదివాను. ముఖ్యంగా ఆ రోజుల్లో నన్ను బాగా కుదిపివేసిన నవలలు అలెగ్జాండర్ క్రుపిన్ నవల ''యామా ది హెల్ హోల్'' (''యమకూపం'' తెలుగులో)

బుచ్చిబాబు నవల ''చివరికి మిగిలేది'', గోపీ చంద్ ''అసమర్థుని జీవయాత్ర'' ఉన్నవ వారి ''మాలపల్లి'' వట్టికోట వారి ''ప్రజల మనిషి'' చలం ''మైదానం''....

''మృత్యువు'' నాటిక (ఈ నాటికను నేను హిందీ లోకి అనువదించాను) కవితా పరంగా నన్ను ఆవ హించిన వారు-గురజాడ,శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, తిలక్, కుందుర్తి...మరోవైపు కవితాత్వికుడు ఖలీల్ జిబ్రాన్ అంతర్గత భావ చైతన్యాన్ని ప్రదీప్తం చేసాడు.

''దిగంబర కవుల నుంచి విరసంలో విలీనమవు తున్న-దశలో నన్ను విపరీతంగా ఆలోచింపచేసి నాపై చెరగని ముద్ర వేసిన గ్రంథం ఫ్రాన్జ్ ఫెనెన్ రచన ''ది రెచెడ్ ఆఫ్ ది ఎర్త్'' (The wretched of the earth-ఈ భూమిపై నికృష్ట జీవులు-) నీగ్రో మానసిక శాస్త్రవేత్త నల్లవాడు ఫెనెన్ ఆల్జీరియా విముక్తి పోరాట నేపథ్యంలో రాసిన ఈ ఫ్రెంచి గ్రంథానికి (ఇంగ్లీషు అనువాదానికి) జ్యాపాల్ సార్త్ర విపులమైన పీఠిక రాసాడు. వలసాధిపత్యంలో వుంటూ బానిస మానసికత అలవాటై మూడో ప్రపంచ దేశాల ప్రజలు క్రమంగా కోల్పోయిన తమ సహజ నాగరికత సంస్కృతులతో పాటు గుడ్డి అనుక రణ ధోరణి ఎంతటి ప్రమాదాన్ని తెచ్చిపెట్టిందో ఫెనెన్ విశ్లేషించి సోదాహరణంగా నిరూపించాడు. ఈ ప్రజల సాయుధ పోరాటమే వారి విముక్తికి మార్గాంతరమని పరిష్కారం చూపాడు.

తాత్వికంగా సార్త్ర రచనలు ఆ తర్వాత మార్క్స్-ఎంగెల్స్-లెనిన్-మావో రచనల అధ్యయనం, చర్చలు నా వైరుధ్యాలను నా భావాల్లోని అస్పష్ట తను తొలగించాయి చాలా వరకు....

## కవిత్వమే జీవితం

అసలు కవిత్వానికి బదులు కథలు, నవలలు మాత్రమే రాయాలనే కోరిక బలంగా వుండేది. కానీ ఉద్యమాల్లో లీనమై కవితా రచన జీవితాంతర్భాగమై పోయింది. ఆ తర్వాత సామాజిక అవసరంగా వ్యాస రచన తోడైంది. ఆలస్యంగానైనా 2002లో కథల సంపుటి 22 కథలతో వెలువడి నూరేళ్ల తెలుగు కథా నిక ప్రపంచంలో నా స్థానాన్ని సుస్థిరం చేసింది.

తెలుగు సాహిత్యంలో నెలకొన్న ముఠాలు, లాబీ యింగ్, ఆశ్రిత పక్షపాతం నా నిర్లక్ష్యానికి మరో కారణం! ఆధునిక తెలుగు కథపై 'నిష్పక్షపాతంగా, సాహిత్య విలువల పరంగా సామాజిక-రాజకీయ ఉద్యమపరంగా ఆరోగ్యకరమైన చర్చ అతి తక్కు వగా జరిగింది.

ఆయా మలుపుల్లో నైరాశ్యం-వోటమి ఎదురై కృంగదీసినప్పుడల్లా, నన్ను రక్షించి సేదదీర్చి - అవ గాహనతో పాటు స్ఫూర్తినిచ్చినవి నా అధ్యయనం-విస్తృత పఠనం, మార్క్సిస్టు సిద్ధాంత మార్గదర్శక త్వంతో పాటు ప్రజా ఉద్యమాలు-పోరాటాలతో పెన వేసుకున్న అనుబంధం. హిందీ సాహిత్యం- పత్రికల



బాల్యంలో (1950) అమ్మ నర్సమ్మతో...

## నచ్చినవి

| | |
|---|---|
| **కథలు** | : పాత తరం - కొత్త తరం రాసిన-బోలెడన్ని కథలు |
| **నవల** | : చివరికి మిగిలేది, అమ్మ, అంటరాని వసంతం |
| **కవులు** | : శ్రీశ్రీ, నెరూడా, ఖలీల్ జిబ్రాన్ |
| **రచయితలు** | : చలం, నెరూడా, సోమర్‌సెట్ మామ్ |
| **సినిమా** | : ప్యాసా, నాగయ్య 'బీదలపాట్లు' బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్ |
| **నటుడు** | : యన్.టి.ఆర్, కమలహాసన్, అమితాబ్ బచ్చన్ |
| **నటి** | : సావిత్రి, మాధురీ దీక్షిత్ |
| **గాయకుడు** | : కిషోర్ కుమార్, హేమంత్‌కుమార్, బాలూ |
| **గాయని** | : లత, భానుమతి, చిత్ర |
| **గ్రంథం** | : ది రెచెడ్ ఆఫ్ ది ఎర్త్ |
| **ప్రదేశం** | : నయాగరా జలపాతం |

ప్రేరణ!

ఉద్యమాల మమేకత్వంతో నా రచనలు పుస్తక రూపంలో సకాలంలో వెలువడలేదు. నా జీవితంలోని అతిముఖ్యమైన కాలాన్నీ-కెరీర్‌ను సమర్పించుకున్నప్పటికీ మా సాహితీ సంస్థలే పట్టించుకోలేదు. ఆయా దశల్లో కథా సంపుటితోపాటు, కవితా సంపుటాలు ముద్రించుకోలేక కవితారంగంలో కూడా నిర్లక్ష్యానికి-ఉదాసీనతకు గురైపోయాను.

అయితే కవితాపరంగా దేశ వ్యాప్తంగా,మన రాష్ట్రంలోనూ నేను పర్యటించిన ప్రదేశాలు-కవి సమ్మేళనాలు, నిర్వహించిన గోష్టులు ఎంతో ఉత్తేజాన్ని కలిగించాయి. వేలాదిమంది శ్రోతల సమక్షంలో నేను నిర్వహించిన కవి సమ్మేళనాలు గొప్ప ఊపునిచ్చాయి.

### నేను కథలు ఎందుకు రాసాను?

నా కథలే కాకుండా, ఇంగ్లీషు-హిందీ నుంచి ఇరవై పైగా అనువాదాలున్నాయి. తెలుగు లోంచి హిందీలోకి అనువదించిన నాలుగైదు కథలను ఆనాటి ధర్మయుగ్, సారిక పత్రికలు ప్రచురించాయి. తెలుగు కథల గురించి ఆంగ్లంలో వ్యాసాలు రాసాను. మరో పది అసంపూర్ణ కథలు, తొలి ప్రకరణం పూర్తి చేసుకున్న నవల, ఇతరత్రా హిందీలోంచి అనువదించిన నవలలు (మహాభారత దేశం-ఆకాశం సొంతం).... ఆరోజుల్లోనే హిందుస్తాన్ టైమ్స్, టైమ్స్ ఆఫ్ ఇండియా, ఆం. ప్ర.టైమ్స్, డక్కన్ క్రానికల్‌లో, సారికలో తెలుగు కథానిక పరిణామం గురించి చిన్న చిన్న వ్యాసాలు రాసాను. ముఖ్యంగా ఫ్రెంచి రచయిత మపాసా, ఉర్దూ రచయిత సాదత్ హసన్ మంటో కథలు చదివి, కొన్ని తెలుగులోకి అనువదించాను.

చలం, శ్రీపాద, చాసో, రావిశాస్త్రి, కారా, కో.కు. మునిపల్లె రాజు, వివిన మూర్తి, అల్లం రాజయ్య, బుచ్చిబాబు తదితరుల కథలు చదివి, కథా కథన శైలి, శిల్పం ఎలా వుండాలో అర్థం చేసుకున్నాను. అర్జెంటైనా కథా రచయిత లూయి బోర్గెస్ కథా శిల్పం ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే జీవితంలో ఎదురయ్యే సమస్యలు, అనుభవ ప్రగాఢతలోంచి పుట్టుకొచ్చే కథలు రాయాలంటే భాష, శైలి, శిల్పం లాంటి మౌలికాంశాల పట్ల అవగాహన అవసరం అనుకున్నాను. ఇక అంతస్సూత్రంగా రాజకీయ-సామాజిక అధ్యయనం-చేరవలసిన గమ్యానికి దిశను సూచిస్తుంది. ఈ వ్యవస్థలో మనిషి జీవితంలోని వివిధ కోణాల నుంచి ఆయా సంఘటనలు-సన్నివేశాల నేపథ్యంలో తాత్వికంగా నిజాన్ని అన్వేషించే కథా రచన కత్తిమీద సాములాంటిది!

నా కథలలో వైవిధ్యం వున్నది. నేను విప్లవ పోరాటాలు, మన విద్యా వ్యవస్థ, మధ్య తరగతి సమస్యలు, స్త్రీ పురుష సంబంధాలు, యుద్ధం, మతం, భూమి సమస్య, విదేశీ జీవితానికి సంబంధించిన ఇతివృత్తాలు ఎన్నుకున్నాను. ముఖ్యంగా భారత్-చైనా ఆ తర్వాత భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో నేను రాసిన మూడు-నాలుగు యుద్ధ కథలకు తెలుగులోనే ప్రత్యేక స్థానంవుంది.

ఈ కథలు రాసి నేను సాధించిన ప్రయోజన మేమిటి? అని ప్రశ్నించుకుంటే-మనిషి నిజ స్వరూపాన్ని వెలుగు నీడల్లో ప్రతిఫలింపజేసి, వ్యక్తి అంతరాంతరాలను, సామాజిక వ్యవస్థను అలానే రాజ్యహింస, విప్లవకారుల ధిక్కారాన్ని కొంత మేరకైనా సజీవంగా నిలపగలిగానని.....

### మార్గదర్శక ప్రముఖులు

హైస్కూలు స్థాయి దాటుతున్న వయస్సులోనే ముషీరాబాద్ బస్తీలో అభ్యుదయ యువక సంఘం స్థాపించి నిర్వహించిన కార్యకలాపాలు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు శ్రీ వెంకట్రామయ జోషిగారి నిస్వార్థసేవ ఒక ఆదర్శంగా, ఆయన గ్రంథాలయం (గౌరీశంకర్) తోడురాగా ఎంతో నేర్చుకోగలిగాను-బయటి ప్రపంచంలో!

దిగంబర కవితోద్యమ కాలం, తదుపరి విప్లవ రచయితల సంఘం, జన సాహితీ తదితర ప్రజా సంఘాలలో ఎదుర్కొన్న సవాళ్లు చర్చలు ఎంతో దోహదపడ్డాయి. ఒకసారి రాజమండ్రిలోని ఒక సాహిత్య సభలో ఆర్.ఎస్.సుదర్శనంగారితో సాగిన తీవ్రమైన వాగ్వివాదం మరచిపోలేను. 1971లో జలంధర్ వెడుతూ, ఢిల్లీలో ఆగినపుడు ''నేషనల్ హెరాల్డ్'' పత్రికాఫీసుకు వెళ్ళి ప్రసిద్ధ సంపాదకులు చలపతిరావుగారితో నా భేటీని మరువలేను. విప్లవ పోరాటాల ఉద్యమపరంగా కొండపల్లి సీతారామయ్య గారిని విన్నాను. కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుల విస్పష్ట సిద్ధాంతం అవగాహన, వారి పరిణత వ్యక్తిత్వంతో పాటు రాజకీయ-సామాజిక చర్చలు ఆకట్టుకున్నాయి. తోడుగా జ్వాలాముఖి స్నేహం, కె.కె.రంగనాథాచార్యుల విమర్శలు ఆత్మీయంగా నిలిచిపోయాయి.



### ఈ నాటి కథా రచన

ప్రస్తుతం యువ రచయితలు కొందరు గొప్ప కథలు రాస్తున్నారు. వివిధ రకాల పురస్కారాలు-ప్రచురణల ద్వారా ఈ తరానికి బోలెడన్ని అవకాశాలు అందుబాటులోకొచ్చాయి.

మానవ జీవితానికున్న అనేక పార్శ్వాలను, కోణాలను చూపగలిగే శక్తి కథకు వుంది. కళాత్మకంగా, కవితాత్మకంగా శిల్పపరంగా ఆకట్టుకోగలిగితే ఆ కథ పది కాలాలపాటు నిలిచిపోతుంది. మనదేశంలో భూస్వామ్య - పెట్టుబడి దారి విలువల్ని కాపాడుతున్న సామ్రాజ్యవాద ''మార్కెట్ స్వేచ్ఛా విపణి'' సంస్కృతిపరంగా దురాక్రమించి సర్వత్రా అల్లుకుంటున్నది. అమానవీయ విష సంస్కృతి ప్రజాస్వామిక విలువల్ని కాలరాస్తున్నది. ఈ విష సంస్కృతిని ఎండగడుతూ ముందు చూపుతో పోరాటస్ఫూర్తినిస్తే, కథకు సార్థకత వుంటుంది.

**-ఎన్.కె. ఆర్. శివరావు**

## నాకు నచ్చిన నా కథ

# మూడు రోడ్ల కూడలి


- నిఖిలేశ్వర్

సువిశాలమైన మైదానం.

ఎదురుగా పొడవుగా వరసగా కొండలు. ఆకాశంలోనేమో ఎర్రగా మండుతున్న సూర్యుడు. సెగలు కక్కుతూ నిప్పులు రాలుస్తూ పెద్ద గుండులాంటి సూర్యుడు.

నేను మరికొంతమంది మిత్రులతో ఆ మైదానంలో పచ్చగడ్డిపై నడుస్తున్నాను.

హఠాత్తుగా ఆ మండే సూర్యుడు భగ్గుమని నిప్పులు కక్కుతూనే చరచరా ఒక వైపుకు దూసుకుపోయాడు. తోకచుక్క రాలిపోయింది. చీకటి కమ్ముకోడం మొదలైంది. మబ్బులేమో రేసుగుర్రాల్లా పరుగు లంకించు కున్నాయి. ఉరుములు... మెరుపులు, అగ్నికురుస్తున్నట్టు ఎర్రని లావా లాంటి వాన చినుకులు, దూరంగా వున్న ఇళ్ళన్ని కదిలిపోతున్నాయి.



మేమంతా పరుగు ప్రారంభించాము.

ఎక్కడో వందల మైళ్ళ దూరంలో వున్న మా ఇల్లు మనసులో మెదిలింది. దగ్గరగా ఎగిరి వెళ్ళేసరికి గోడలన్నీ అట్టముక్కల్లా రాలి కింద కూలి పోతున్నాయి. కూలిన ఇళ్లలోని కుటుంబాలను కాపాడాలని ప్రయత్నిస్తున్నాము.

అటు ఇటు పరిగెడుతుండగా... నేను ఒక్కదాన్ని ఒక ఇంటి చివరిగా వెళ్లి వెనక తలుపు తెరిచాను మెల్లిగా, గబాలున ఒకడు చింత నిప్పుల్లాంటి కళ్లతో చాకు దూసి నా మీదకు రాబోతున్నాడు... పెద్దగా అరిచి కళ్ళు తెరిచి చూసాను చుట్టూ నా గదిలో కల చెదిరిపోయింది.

ఈ ఉదయమే మళ్ళీ ఇలాంటి కల వచ్చి నా మనస్సునంతా విషాదంతో నింపి వెళ్ళింది.

నా హాస్టల్ గదిలోనే మంచంపై నుంచి లేచి నిలుచున్నాను. కిటికీ దగ్గరగా వెళ్ళి వెలుపలికి ఆ సిల్వర్ వోక్ చెట్లపైకి చూపులు మళ్లించాను. తెల్లారే అలా నా మనస్సునంతా చిందరవందరచేసి వెళ్లిన ఆ భయంకరమైన కల - కాదు కాదు, విచిత్రమైన కల వల్ల తిరిగి రాకేష్ జ్ఞాపకాలు మెరవసాగాయి.

ఓ రాకేష్ ఇప్పుడు లేడు.

మనసారా సర్వస్వంగా ప్రేమించి స్నేహ మూర్తిగా ఆరాధించిన నా నేస్తం రాకేష్ వెళ్ళిపో యాడు నాకు అందకుండా...

నా ప్రశ్నలను నా అనుమానాలను లెక్క చేయకుండా తన మానాన తాను ఉద్యమం లోకి వెళ్ళిపోయాడు.

ఆచరణ లేని ఉత్తుత్తి ఆలోచనలన్నీ వ్యర్థమే నన్న రాకేష్ ''ఎన్‌కౌంటర్''లో చనిపోయాడు.

నేను మాత్రం ఇలా అతని జ్ఞాపకాల్లో అక స్మాత్తుగా వచ్చే కలల్లో సజీవం గానే ''ఎన్‌కౌంట ర్''లకు గురవుతూ వుండిపోయాను.

ఈ ఉదయం హాస్టల్‌లోంచి బయటికి వచ్చే సాను.

ఆర్ట్స్ కాలేజిలో నా పి.జీ క్లాసు ఎగ్గొట్టి క్లాస్ మేట్ రజనితో లైబ్రరీ వైపు నడుస్తున్నాను.

ఈ యూనివర్సిటీలో నడిచినప్పుడల్లా మనస్సు అనాయాసంగానే ఎటు చూసినా చెట్లుగా ఊగే కొమ్మల్లా నిశ్శబ్దంగా రాసుకునే పొదల్లా ఎంత నివారించినా చుట్టుముట్టి ఆరాట పెడుతుంది.

లైబ్రరీలోకి వెళ్ళి ఒక మూల పుస్తకం తెరచి కూచున్నాను. ఏదో చదవాలనే వ్యర్థప్రయత్నం. ఆ పుస్తకం పుటల్లో రాకేష్ కనపడుతున్నాడు... ఆ జ్ఞాపకాలే మళ్లీ... ఆ రోజు వర్సిటీ షాపింగ్ సెంటర్ ఒయాసిస్‌లో టీ తాగి మేమిద్దరం బయ లుదేరాము. సూటిగా పరచుకున్న రోడ్లను వదిలి పెట్టాము.

రోజూ నడిచే ఆ రోడ్లే ఒక్కోసారి విసుగు తెప్పిస్తాయి. కూలిన కొమ్మలు ఫుట్‌పాత్‌లపై వర సగా శవాల్లా పేర్చారు పనివాళ్లు. యూనివర్సిటీ సొత్తు మరి ప్రతి పూచికపుల్లా లెక్కలోకి రావల సిందేనట!

''తెల్ల ఏనుగుల్లాంటి డిపార్ట్‌మెంట్‌లపై ఎన్ని లక్షలు తగిలేసినా సాధించేం ప్రయోజనం? పచ్చిక బీళ్లవంటి చిన్నచిన్న స్కూళ్లను ఆదుకునే నాధుడెవడీ దేశంలో?!''అని రాకేష్ ప్రశ్నించేవాడు.

పిల్లబాట వెంబడి సాగిపోతున్నాము. కొబ్బరి తోటలోంచి చీలుతూ పోయిన ఆ సన్నని దారి నీటిపాయలా మమ్మల్ని లాక్కెళ్లిపోయింది.

మెలికలు తిరిగిన ఆ దారిలో మలుపు తిరి గాము.

హుటాహుటిన పరిగెత్తిన ఉడుత... గంతేసి వెళ్ళిపోయిన తొండ.... కొమ్మలపై పక్షుల నవ్వడి.

ఒక చిన్నమ్మాయి ఆ షార్ట్‌కట్ పిల్లబాటలో ఎలాంటి భయం లేకుండా ఒక్కతే మామిడికా యల కోసం రాళ్లు విసరికొడుతోంది చెట్లపైకి.

అడవి కాదు ఇది. అయినా అక్కడ ఆ ప్రదేశ మంతా అడవిలానే వుంది. కనుచూపుమేర ఎటు చూసినా చెట్లే. వందలాది చెట్ల మొండేల్లాంటి లావాటి ఎత్తైన మొద్దులే... పైకి దృష్టిసారిస్తే



వెలుగు సోకని ఆకులు... సూర్యుని కిరణాలు చొచ్చుకొచ్చే అవకాశమే లేదు.

లోయలా ఏర్పడిపోయిన పెద్దకాలువ పారే ప్రదేశం... ఇప్పుడేమో అసలు నీళ్లు లేవు... వానా కాలం ఇటు రాలేము.

మేమిద్దరము అలా నడిచేవాళ్లము. చేతులు పట్టుకున్నా రాకేష్ ఆ చెట్ల నిశ్శబ్దం మసక వెలు తురులో అల్లరేం చేసేవాడుకాదు. సాగుతున్న చదువు.. పెరుగుతున్న వయస్సు.... పెనవేసు కుంటూ పోతున్న ప్రేమ... ఇక్కడ ఎవ్వరూ వెన

## దిక్కారస్వరం



*ఆయా దశల్లో నన్ను కదిలించిన సంఘటనలు, సన్నివేశాలతో పాటు వెంటాడిన ఆలోచనలు నా కథా ఇతివృత్తాలు. 'సూర్యుడు', 'విరుచుకపడిన కెరటం', 'మూడు రోడ్ల కూడలి' శీర్షికలతో వచ్చిన కథలు – పోరాటాల క్రమంలో రాజ్యహింసను, అనేక సమస్యలను ప్రశ్నలను యువత ఎదుర్కొన్న యథార్థాలు....*

*ముఖ్యంగా ఈ కథ 'మూడు రోడ్ల కూడలి'' ఆనాటి యూనివర్సిటీ విద్యార్థుల మనోభావాల వ్యక్తీకరణ – ఈ కథ నేపథ్యమంతా మైసూర్, ఉస్మానియా విశ్వవిద్యాలయాల నైసర్గిక వర్ణనలతో కూడినది. తిరుగుబాటు నుంచి విప్లవ పోరాటాలలో లీనమయ్యే యువతీ యువకులు ఎదుర్కొనే కీలకమైన సమస్యలన్నీ ఇలాంటి మూడు రోడ్ల కూడలి సంధి దశగానే వుంటాయి.*

**–నిఖిలేశ్వర్**

సెల్: 91778 81201

కబడి అల్లరి పెట్టేవాళ్లు లేరు. ఎప్పుడైనా ఎవరైనా ఎదురైతే అలా మమ్మల్నిచూసి తమ దారిన తాము నడచి వెళ్ళి పోయేవారు.

ఆ చీలిన సన్నదారిలోంచి బయటికి వచ్చే సాము. ఎదురుగా చతురస్ర ఆకారాల అందం లేని కాంక్రీట్ బిల్డింగ్‌లు....

రాకేష్ ఇదే క్యాంపస్‌లో టెక్నాలజీ హాస్టల్‌లో వుంటాడు.

వీలున్నప్పుడు ఇలాదారిలో కలిసి కబుర్లు చెబుతూ నడిపిస్తూ! తీసుకెళ్ళి పోతాడు.

మా యూనివర్సిటీలోని మూడు రోడ్ల కూడలి ఒకటా రెండా? ఏ పక్కకు వెళ్లినా మూడు దారులను కలిపే ఒక జంక్షన్ ఎదురవుతుంది.

అలాంటి కూడలి దగ్గరికి వచ్చినప్పుడల్లా రాకేష్ నన్ను నిలబెట్టి ప్రశ్నించే వాడు.

''రమా! నువ్వు నేను ఈ ''ట్రై జంక్షన్''లో నిలుచున్నాము.

ఒకదారి అటు దూరంగా చెట్ల మధ్యకు ప్రకృతి వొడిలోకి. రెండో దారి ఇటు జనారణ్యంలో సుఖాల వేటలోకి, మూడో దారి ప్రజా విముక్తి పోరాటంలోకి, కమాన్! ఏ దారి ఎన్నుకుంటావో తేల్చిచెప్పేయ్!''

నేను నవ్వి వూరుకునేదాన్ని.

మరో రోజు మిట్టపల్లాలు దాటి రోడ్డెక్కాము. మా లోకంలో, మా ఇద్దరి దేహాల వేడి వాసన అలా లాక్కెళ్లిపోతుంది.

పక్కనుంచి వెడుతున్న వాహనాల ధ్యాస లేదు. మనుషుల చూపుల లెక్కే లేదు.

సరస్వతినగర్ కొత్తకాలనీలోని నిర్మానుష్యమైన దారివెంబడి నడుస్తున్నాము.

మరో పక్కనుంచి ఉవ్వెత్తున విరుచుకపడబోతున్నట్టు మబ్బుల కెరటాలు.

ఆకాశం కాస్త దూరంలోనే భూమిని కావలించుకుంది.

ఆ దిగంతం పక్కనే మా కాళ్లు నడచి వెడుతున్నాయి. కొంచెం దూరంలో ఎటుచూసినా కూలిన గోడలు. మైదానంలో ఏవో శిథిలాల అవశేషాలు కాదు – అవి కూల్చబడిన పాత ఇళ్లు.

పక్కనే ఎన్నో గుడిసెలు, పేదరికానికి సజీవ చిత్రాలు.

వీటికి మాతో నడిచి వస్తున్న ప్రకృతి దగ్గర సమాధానం లేదు. తరతరాలుగా అడవుల్లోంచి నదీ తీరప్రాంతాలకు వలస వచ్చేసిన మనుషులు ఇలా విస్తరించి విస్తరించి అడవుల్ని మైదానాలుగా మార్చుకుంటు పోయారు.

మారిన మైదానాల్లో అప్పుడు మొదలైంది బలవంతుడికీ బలహీనుడికీ ధనిక పేద అనే వ్యత్యాసాల సమరం.

''ఈ వర్గ కలహాన్ని పరిష్కరించే ప్రజాస్వామ్యం ఇప్పటికీ వున్నవాడికే ఊడిగం చేస్తుంటే ప్రకృతి ఏం చేయగలదు?'' అని రాకేష్ ఎదురు ప్రశ్న వేసే వాడు.

మరో దారి దగ్గర మలుపు తిరిగి ఇటువైపుగా నడచి వచ్చేస్తున్నాము. సూర్యుడు ఎరుపునంతా చిమ్మి క్రమంగా వెండి వెలుగులోకి మారిపోయేవాడు. మాతో నడుస్తూనే పరిసరాల వెంబడి మారిపోతున్నది ప్రకృతి.

ప్రెస్ రోడ్డుపై అప్పుడు మరీ నిర్మానుష్యంగా వుంది.

పక్కని పొదల్లోంచి అటుఇటూ చూస్తూ ఒక ముంగీస రోడ్డు మీదికి వచ్చింది. మేము అలా నిలబడి చూస్తుండి పోయాము. గబగబా నడుస్తూ రెండో వైపున్న యూకలిప్టస్ చెట్ల మధ్య మాయమైపోయింది. ఏ పాము వేటలో వుందో ఏమో ఆ ముంగీస?

ఆకాశం రంగు మారిపోయింది. వెలుగు నీడల సయ్యాట ఆగిపోయింది.

మా ఇద్దరి నడక మాత్రం అలా సాగిపోతూనే వుంది. మా మధ్యనే ఎప్పుడూ నడిచే ప్రకృతికి అనుమానం వేసి వుండొచ్చు. ''ఏదో ఒక చెట్టు పక్క కూచుని ముద్దు ముచ్చటలాడకుండా ఇలా ఏమిటి కాళ్లు పీకేస్తుంటే...!''

రాకేష్ పక్కన వుంటే నాకూ, అలాగే అతనికీ ఇలా సాయంత్రాలు దూరానికి నడిచిపోవడం మామూలే! కూచుంటే కదా అలసట తెలిసేది?

మా అమ్మాయిల హాస్టల్ బయట సాయంత్రాలు బాయ్ ఫ్రెండ్స్ వచ్చి గర్ల్ ఫ్రెండ్స్‌ను కలిసిపోతుంటారు. కొందరు అలా దూరంగా వెళ్లి యూనివర్సిటీ చెరువుగట్టున కూచుని కబుర్లు చెప్పుకుంటారు. మాకు ఇలా నడిచి వెళ్ళడం సరదా!

ఇప్పుడు ప్రకృతి మా వెంటే మసక వెలుతురులోంచి చీకటిలా మారిపోయింది.

చుట్టూ విపరీతంగా గాలిహోరు! చెట్లు పిచ్చి పట్టినట్టు పూనకంతో వూగి పోతున్నాయి.

రోడ్డు పక్కనే వున్న కల్వర్ట్‌పై బ్రిడ్జి గోడపై ఇద్దరు కూచుని వున్నారు. దగ్గరగా నడుస్తూ చూస్తే ఇద్దరు యువ దంపతులు (ప్రేయసీ ప్రియులేమో మరి చెప్పలేం!) ఒకే శాలువా కప్పుకొని ఆ గాలిలో వెచ్చగా దగ్గరగా కబుర్లాడుతున్నారు. అతనికి అందమైన చిన్నగడ్డం, తెల్లగా నాజూగ్గా వున్న ఆవిడ.... అలా వాళ్ళిద్దరి ప్రపంచంలో వాళ్లు!

ముందుకు అంటే ఇప్పుడు వెనక్కి హాస్టల్‌కు తిరుగు ప్రయాణంలో వున్నామన్న మాట... ఇంకా ఆలస్యమైతే మా హాస్టల్ వార్డన్ లేనిపోని ప్రశ్నలన్నీ అడిగి ప్రాణం తీస్తుంది.

మూడుదారుల కూడలికి చేరుకున్నాము. పక్కనే గుడిసె కొట్టులో టీ అమ్ముతాడు. ఈ గుడిసె కొట్టులో మణెమ్మ టీ తయారు చేస్తుంది. పక్కనే వున్న సుబ్బయ్య మీద ఏవో కేకలు వేస్తోంది.

సుబ్బయ్య కాస్సేపు విని అన్నాడు – ''ఇక చాల్లేవే నీ అరుపులు మణెమ్మా?''

మణెమ్మ సుబ్బయ్య అసలు భార్య కాదు, అతని మొదటి భార్య, ఇద్దరు పిల్లలు ఉప్పల్ ఊళ్లో వుంటారు విడిగా... మరిక్కడేమో ఇతను ఈమెతో అలా స్నేహంగా కలిసిమెలసి వుండిపోయాడు. అందరేమో ''వుంచుకున్నావిడ'' అని వెక్కిరింతగా అంటారు. కాని సుబ్బయ్య ఎప్పుడూ ఆమెని మర్యాదగా 'మణెమ్మ' అని ప్రేమగా పిలుస్తాడు.

పెరుగుతున్న చీకటితోబాటు మేము మరింత వేగంగా ముందుకు నడచి వెడుతున్నాము. మళ్ళీ మూడుదారుల ముడులే తప్ప నాలుగు రోడ్ల చతురస్రాలు కనపడనే లేదు.

ఆ మూడు రోడ్ల కూడలిలో బస్సుకోసం పడిగాపులు పడుతూ కూచున్న కూలీలు. దినమంతా రెక్కలు ముక్కలు చేసుకొని పొట్టకూటి కోసం శ్రమించే వీళ్ల రాత్రి ఒక్కోసారి బస్సు దొరక్క నకనకలాడే ఆకలితో ఇంటికి వెడుతుంటారు. వరుసగా రోడ్డు పక్క మసక వెలుతురులో అలా అలసటగా ముడుచుకొని కూచున్న ఆ మనుషుల దగ్గర ప్రతి వొక్కడి దగ్గర ఖాళీ సద్దిగిన్నెలు.

పిల్లలు పెద్దలు ఆడ మగ అనేకమంది అలా రోజూ పది కిలోమీటర్ల దూరంలో వున్న ఊళ్లో నుంచి పనికి వస్తుంటారు. ముఖ్యంగా యూనివర్సిటీలో సిబ్బందికి కట్టే క్వార్టర్లకు కాయకష్టాన్ని

అందించి ఆకారాన్ని ఇచ్చే వీళ్లు ఇలా జీవితాంతం ఇదే విధంగా బతికేస్తుంటారు. ఎదుగుబొదుగు లేని జీవితాలతో తమకిదే ప్రాప్తమని తృప్తిపడ తారు.

కొందరు పిల్లలు రోజూ తమ టిఫిన్ క్యారియర్లతో తమ తోటి పని కుర్రాళ్ళతో సైకిళ్లపై వెడుతుంటారు. బాల్యం నుంచే అన్నం కోసం అగచాట్లు ప్రారంభం వీళ్లకు.

మా హాస్టల్‌లో పనిచేసే కుర్రాడు పోచయ్య వయస్సు 14 సంవత్సరాలు. ఎప్పుడూ నవ్వుతూ అలసట లేకుండా చెప్పిన పనల్లా చేస్తూ వెళ్ళిపోతుంటాడు. ఇతనికి చదువు అక్కరలేదా? అయినా ఎవరు చదివిస్తారు? కాలు విరిగి మూల పడిన తండ్రి, కూలిచేసే తల్లి, ఇద్దరు చెల్లెళ్లు బతకాలంటే పోచయ్య కూడా పనిచేయాలి. ఏదో సంపాదించి ఇవ్వాలి.

అతని భవిష్యత్తుకు ఈ పరిధిలోనే సీలు పడిపోయింది. పెద్దవాడై పెళ్లి చేసుకొని మళ్ళీ తన తండ్రిలానే తానూ ముసలివాడై మరికొందరు పని కుర్రాళ్ళ తండ్రిగా...

మా ప్రొఫెసర్‌ను ఈ దేశంలోని బాల కార్మికుల గురించి పేదరికం గురించి అడిగితే "మరి పని చేసేవాళ్లు వుండవలసిందే కదా! సరి సమానత్వం ఎలా సాధ్యం ఎక్కడైనా? ఇక పేదరికమంటావా? నా స్థాయిలో నా అవసరాలు తీరక నేను పేదవాణ్ణే!" అని చాలా సీరియస్‌గా తన సొంత ఫిలాసఫీలో మధ్య తరగతి నుంచి పైకి లేచిన తమ స్థాయి మనుగడ దృష్టితో అనేవాడు.

రాకేష్ ఇది విని కోపంగా తిట్టేవాడు. "బాస్టర్డ్స్! ఈ మెదడు నమ్ముకుని బతికే ఉపన్యాసకుల'కు తమ ఇల్లు, పెళ్ళాం, పిల్లలు, స్కూటర్లు లేదా కార్ల పెట్రోలు ధ్యాస తప్ప మరోటి వుండదు!"

టంగ్... టంగ్... టంగ్.. లైబ్రరీ గోడ గడియారం లోంచి గంటల చప్పుడు మళ్లీ వర్తమానంలోని క్షణాల మీదికి ధ్యాసను మళ్ళించింది.

రాకేష్‌కు వర్తమానంలో ఏదో ఒకటి చేయాలనే పట్టుదల వుండేది. ఫలితం ఎలా వున్నా ఆచరణ ముఖ్యమనే మొండివాదన అతనిది.

చివరిసారి కలసినప్పుడు రాకేష్ దృఢ నిశ్చయంతో చెప్పిన మాటలు ఇప్పుడు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఈ దేశంలో కూడా శ్రామిక విజయం ఏనాటికైనా తప్పదు! ఆ ఆశయం కోసం ఇప్పుడు రక్తతర్పణ చేయవలసినా వెనుకాడేది లేదు''.

అప్పుడే నేను, మా మిత్రులు రాకేష్‌ను అంతే ధృడంగా నిలదీసి, ఎదురు ప్రశ్న వేసి మాకు వున్న అవగాహనతో వాస్తవాన్ని విప్పి చెప్పాము.

"ఈ దేశంలో సరికొత్త మధ్య తరగతి తల ఎత్తింది. దానికి సులువైన మార్గాల్లో డబ్బు సంపాదన, సుఖజీవనం కావాలి. ఉద్యమం, త్యాగాలు ఈ వర్గానికి అర్థంలేని మాటలు. మరో వైపు శ్రామికవర్గం అంతే అనైక్యతతో చీలిపోయి వుంది. కులం, మతం ఇక్కడి శక్తివంతమైన ఆయుధాలు. వర్గపోరాటాల్ని ఇవి పురిట్లోనే చిదిమివేస్తుంటాయి. అలాంటప్పుడు శ్రామిక విజయం ఇక్కడా తప్పదనే గ్యారంటీ ఏమిటి? విప్లవ చరిత్ర పాత పద్ధతిలోనే ఇక్కడకూడా అలానే పునరావృత మవుతుందనే నమ్మకం ఏదీ?"

"మీ అనుమానాల ఊబిలో మీరంతా ఇలానే ఎటూ గాకుండా చావండి. చివరికి మీరు కూడా అవినీతిలో పెరుగుతున్న కొత్త మధ్యతరగతి వానపాముల్లో కలిసిపోండి. నేను మాత్రం నా పద్ధతిలో ఈ దుర్నీతిని, అవ్యవస్థను ఎదిరిస్తాను" అని కోపంగా వెళ్ళిపోయాడు రాకేష్.

ఆ "ఎన్‌కౌంటర్" జరిగిపోయిన తర్వాత రాకేష్ నమ్మకం మాత్రం మిగిలి పోయింది. మా అనుమానాలు, ప్రశ్నలు ఎప్పటిలానే ఎదురుతిరిగి అందరిని నిలదీస్తున్నాయి.

పుస్తకం మూసేసి లైబ్రరీ లోంచి తిరిగి వాస్తవ ప్రపంచంలోకి నా నడక కొనసాగిస్తున్నాను.

ఒక మూల నా మనసులో ఒక సంశయం పీడిస్తూ వుండేది. మధ్య తరగతి భయాల మూలాన నేను ఈ దృక్పథాన్ని సమర్థిస్తున్నానేమో? ఈ వ్యవస్థలో బతికే ప్రతి ఒక్కరికీ ఒక రక్షణ కవచం అనుకోకుండానే లోలోపల ఏర్పడిపోయింది కాబోలు! దీనిని ఛేదించుకుని వస్తుపరంగా ఎంతమంది పరిస్థితిని అంచనా వేయగలరు?

లైబ్రరీ వెలుపలికి వచ్చి చుట్టూ చూశాను. ఎదురుగా లాండ్‌స్కేప్ గార్డెన్స్ పక్కనే 'లా' కాలేజి గోడలు - గోడలపై నినాదాలు చదువుతూ నడిచాను.

"జీనా హైతో మర్‌నా సీఖో కదమ్ కదమ్ పర్ లఢ్‌నా సీఖో" ("బతకాలంటే చావడం నేర్చుకో - అడుగడుగునా పోరాటం నేర్చుకో").


పోరాటాల్లో వ్యక్తిగతమైన తెగింపు అవసరమే కాని ప్రజా సమీకరణ లేని చోట కేవలం వొంటరిగాళ్ల బాటగా మారిపోతే ఎవరికి ప్రయోజనం? త్యాగాలు నిష్ప్రయోజనమైతే తర్వాత మిగిలేవాళ్లు ఎంతమంది? ఈ ప్రశ్నకు సమాధానం వర్తమానం ప్రత్యక్షంగా చూపుతూనే వుంది.

**(ఆదివారం ఆంధ్రజ్యోతి, 19-11-1989)**

## తృప్తీ నీ వెక్కడ!

కవిత
poem

ఆగర్భశ్రీమంతుడిని
ఖరీదయిన కార్లూ బంగళాలు
అడుగులకు మడుగులొత్తే
నౌకర్లు చాకర్లు
సిరిసంపదలతో అడుగిడిగిన భార్య
తండ్రిగా పదోన్నతి కల్పించిన పిల్లలు
వ్యాపారంలో పట్టిందల్లా బంగారం
వడ్డించిన విస్తరి నా జీవితం




అయినా
మనసు మారుమూల పొరల్లో
ఏదో తెలియని అసంతృప్తి
ఇంకా ఏదో సాధించాలనే ఆరాటం
వ్యాపార సామ్రాజ్యం విస్తరించి
సార్వభౌమాధికారి కావాలని తహతహ
ఆ దారిలో
గులాబీల సౌరభంతో పాటు
ముళ్లు కూడా గుచ్చుకున్నాయి
క్షణం తీరిక లేని సంపాదన
విశ్రాంతి తెలియని జీవన గమనం
అలసిన తనువు మనసు
సేద తీరాలని మొరాయించాయి
ఒయాసిస్‌లాంటి ఇల్లు గుర్తుకొచ్చింది
వడివడిగా గృహోన్ముఖుడినయా
హర్షాతిరేకంతో పరుగున వచ్చి
కాళ్లను పెనవేసుకున్నారు పిల్లలు
ఆతృతగా ఆత్మీయంగా పలుకరించాయి
ఆలి కనుదోయి
ఆమె ఒడిలో తలనిడి కనులు మూశా
ప్రేమగా తలనిమురుతూ
సాంత్వన కలిగించింది
మటు మాయమయింది
నా అలసటంతా
నా కింతవరకూ అనుభవం లేని
ఒక ప్రశాంతత
మనసెంతో సంతృప్తిగా హాయిగా వుంది
జీవితంలో నే సాధించిన
విజయాలన్నిటికన్నా
నేననుభవించిన ఈ తృప్తి
తులసి దళమల్లె తూగి
విజేతగ నిలిచింది

-కేతవరపు రాజ్యశ్రీ